క్లుప్తంగా

సేవారంగంలోకి యువత రావాలి


మహిళకు కుట్టు మెషీన్ అందజేస్తున్న క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్ : సేవా రంగంలోకి యువతను తీసుకురావాలని లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ వీఎస్ వీడీ శివప్రసాద్ క్లబ్ సభ్యులకు సూచించారు. స్థానిక దంటు కళాక్షేత్రంలో ఆదివారం కాకినాడ లయన్స్‌క్లబ్ జెమ్స్, ఉప్పాడ కొత్తపల్లి లయన్స్‌క్లబ్ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సేవ చేయాలనే తపన ఉన్న వారిని క్లబ్‌లోకి ఆహ్వానించాలన్నారు. మాజీ గవర్నర్ లింగమల్లు కృష్ణమూర్తి మాట్లాడుతూ కరోనా సమయంలో జెమ్స్‌క్లబ్ అందించిన సేవలు మరువలేనివన్నారు. అనంతరం లయన్స్‌జెమ్స్ క్లబ్ అధ్యక్షులుగా వైవీఎస్ సతీష్, కార్యదర్శిగా దేవతా నరసింహమూర్తి, కోశాధికారి లింగమల్లు శ్రీనివాసరావుతోపాటు ఇతర సభ్యులతో ఇన్‌స్టలేషన్ ఆఫీసర్ అనిల్‌కుమార్ శేర్ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన సభ్యులు సేవా కార్యక్రమంలో భాగంగా నిరుపేద మహిళలకు కుట్టు మెషీన్లు అందించారు. క్లబ్ లీడర్‌షిప్ ఇనిస్టిట్యూట్ కో ఆర్డినేటర్ రమేష్‌రాజు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ కమిషనర్



కాకినాడ: 'జగనన్నకు చెబుదాం'లో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం 'డయల్ యువర్ కమిషనర్' నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల చెప్పారు. ఉదయం 9:30 నుంచి 10:30 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్యం, అనధికార కట్టడాలు, ఇతర అంశాలపై 0884 2357800 నెంబర్‌కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. అనంతరం 10:30 గంటలకు నగరపాలక సంస్థ కార్యాలయంలో స్పందన యథావిధిగా కొనసాగుతుందన్నారు.

నేరాల అదుపునకు సహకరించండి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నాయక్

కాకినాడ: ప్రజల్లో చైతన్యం పెరిగినప్పుడే నేరాలను పూర్తిస్థాయిలో అదుపు చేయగలమని టూ టౌన్ సీఐ నాయక్ పేర్కొన్నారు. స్థానిక బర్మా కాలనీలో నేరాలను అదుపు చేసేందుకు తీసుకోవలసిన చర్యలపై ప్రజలకు వారధి పేరిట అవగాహన కల్పించారు. మత్తు పదార్థాల విక్రయం, అసాంఘిక శక్తుల సంచారంపై ప్రజలు ఎప్పటికప్పుడు పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. ఏడో డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తి రవిరెడ్డి, కె.దేవకి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి నిరంతర సేవలు


వృద్ధులకు సహాయం చేస్తున్న ట్రస్ట్ చైర్మన్ హరీష్

బాలాజీచెరువు: వృద్ధాశ్రమానికి తన సేవలు నిరంతరం ఉంటాయని హరీష్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలాటం హరీష్ పేర్కొన్నారు. తూరంగి వృద్ధాశ్రమానికి ట్రస్ట్ ద్వారా దుప్పట్లు, పండ్లు, చీరలు, బకెట్లు ఆదివారం పంపిణీ చేశారు. హరీష్ మాట్లాడుతూ విద్య, వైద్య పరంగా సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

శాకంబరుడిగా రామలింగేశ్వరుడు



పిఠాపురం: పంచాయతన సమేత ఉమా రామలింగేశ్వర స్వామి ఆదివారం శాకంబరుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు దత్తు వీరబాబు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మయూరమై మదిని దోచె..

- నృత్యంలో రాణిస్తున్న యువత
- నాట్యజ్యోతి పురస్కారాలు స్వీకరణ

కాకినాడ కల్చరల్: కేవలం చదువుకే విద్యార్థినులు పరిమితం కాకుండా నృత్యం, సంగీతం వంటి శాస్త్రీయ కళల్లో మేటిగా రాణిస్తున్నారు. వారిలో కళాతృష్ణ చదువుకు ఆటకం కాదని నిరూపిస్తున్నారు. అంతే కాకుండా కళల్లో శిక్షణ పొందడం ద్వారా ఏకాగ్రత, మానసిక ప్రశాంతత చేకూరుతోందని చెబుతున్నారు. దీనికి తోడు తల్లిదండ్రులు కూడా వారిని ప్రోత్సహించడంతో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తమ సత్తా చూపుతున్నారు. ఇటీవల హైదరాబాద్‌లోని రవీంద్రభారతి వేదికపై మయూరి నృత్యాలయం సంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో 'గురు వందనం' పేరుతో నృత్య ప్రదర్శనలు చేశారు. ప్రదర్శనలో విద్యార్థినులు పాల్గొని చక్కని ప్రతిభ ప్రదర్శించి నాట్యజ్యోతి పురస్కారాలు స్వీకరించారు.


నాట్యజ్యోతి పురస్కారాన్ని అందుకుంటున్న విద్యార్థినులు

నాట్యం అంటే ప్రాణం



నా పేరు కె.జియ సుప్రజ. నాట్యజ్యోతి అవార్డు పొందడం చాలా సంతోషంగా ఉంది. 4 తరగతి చదువుతున్నాను. అంతర్జాతీయ వేదికలపై నృత్య ప్రదర్శన చేసి మెప్పించాలనే ఆశయంతో శిక్షణ పొందుతున్నాను. మా తల్లిదండ్రులు ప్రేమ్‌కుమార్, సుధారాణి, ముఖ్యంగా మా గ్రాండ్ మదర్ సుగుణ మంచి సహకారం అందజేస్తున్నారు.

మంచి నర్తకిగా రాణిస్తా



నాపేరు దేవిశ్రీ లక్ష్మి ప్రసన్న. నాట్యజ్యోతి అవార్డు పొందడం ఆనందంగా ఉంది. 7వ తరగతి చదువుతున్నా. శాస్త్రీయ నృత్యం అంటే ప్రాణం. మరిన్ని మెళకువలు నేర్చుకుని అంతర్జాతీయ వేదికపై ప్రదర్శన ఇవ్వాలనేది నా కోరిక. చదువుకు కళల అభ్యసన ఆటంకం కాదు. మరింత ఏకాగ్రతను పెరుగుతోంది.

నాట్యానికి ఆదరణ పెరుగుతోంది



ప్రస్తుతం నృత్యానికి ఆదరణ పెరుగుతోంది. ఈ కళపై ఆసక్తి ఉన్న వారిని నర్తకీమణులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం. ఈ కళలను కాపాడేందుకు చిరప్రయత్నం చేస్తున్నాం. అంతర్జాతీయ వేదికలపై ప్రదర్శనలు ఇచ్చే స్థాయిలో విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్నాం.

– నాట్యాచార్య బేతా సత్యనారాయణ, కాకినాడ

ఏకాగ్రత పెరుగుతోంది



నాట్యజ్యోతి అవార్డు పొందడం చాలా సంతోషంగా ఉంది. 7వ తరగతి చదువుతున్నాను. ఆరేళ్ల నుంచి నాట్యం నేర్చుకొంటున్నాను. నాట్య సాధన వల్ల ఏకగ్రాత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. సంప్రదాయ నృత్యాన్ని ఇష్టంతో సంతోషంగా సాధన చేయాలి. నాట్యరంగంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలనేదే నా కోరిక.

చాలా సంతోషంగా ఉంది



నాపేరు ధరణి సూర్యప్రియ, 4వ తరగతి చదువుతున్నాను. నాట్యజ్యోతి పురస్కారం రావడం ఆనందంగా ఉంది. మా తల్లిదండ్రులు మల్లేశ్వరి, శివప్రసాద్ మంచి ప్రొత్సహం ఇస్తున్నారు. దీంతో నృత్యం నేర్చుకొంటున్నాను. కూచిపూడి నృత్యంలో డిప్లమో చేయాలనే ఆశయంతో ఉన్నాను.

భవన నిర్మాణాలకు ప్రణాళిక అవసరం

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

బోట్‌క్లబ్: భవన నిర్మాణాలకు ప్రణాళిక అవసరమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక ఒక హోటల్‌లో ఆదివారం భారత ఆర్కిటెక్టుల సంస్థ కాకినాడ సెంటర్ 2023–25 సంవత్సరానికి ఎన్నికైన నూతన కమిటీ అభినందన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. కాలానికి అనుగుణంగా ఆర్కిటెక్టులు ప్రమాణాలు, నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. కాకినాడ నగరం మంచి ప్రణాళికతో ఏర్పడిందన్నారు. ప్రస్తుతం స్మార్ట్ సిటీ నిధులతో మరింత సుందరంగా తయారైందన్నారు. కాకినాడ మెయిన్‌రోడ్డు, దేవాలయంవీధి, సినిమా రోడ్డు వేరువేరుగా ఏర్పాటు చేయడంతో సౌకర్యవంత నగరంగా తయారైందన్నారు. ఆర్కిటెక్టు సంఘం అధ్యక్షుడు వీవీఎల్ఎన్ మూర్తి మాట్లాడుతూ కాకినాడ మహిళా పాలిటెక్నిక్‌లో కళాశాల్లో ఆర్కిటెక్చర్ డిప్లమా కోర్సు తీసివేశారని, ఉద్యోగాలు వచ్చే అటువంటి కోర్సు మహిళలకు చాలా ఉపయోగకరమైనదన్నారు. ఈ కోర్సును పునరుద్ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్కిటెక్ట్ సంఘ అధ్యక్షులు విజయభాస్కర్, విశాఖపట్నం ఆర్కిటెక్ట్ సంఘ అధ్యక్షులు రాజేష్, కాకినాడ ఆర్కిటెక్ట్ సంఘ కార్యదర్శి ఎం.వెంకటేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

కరప: వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈఓ పీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు కార్యదర్శులకు సూచించారు. వేళంగి, కరప, జి.భావారం, కూరాడ తదితర గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి పారిశుధ్యపనులను పరిశీలించి, సూచనలు చేశారు. కార్యదర్శులు ఎస్కే నాగేంద్రకుమార్, , పి.ఉమామహేశ్వరి, పి.శ్రీనివాస్, పి.రవి పాల్గొన్నారు.

చేసిన సేవలే చిరస్థాయిగా మిగిలేవి

ఎంపీ గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కన్నబాబు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): సమాజంలో చేసిన సేవలే మనం ఉన్నా లేకపోయినా చిరస్థాయిగా నిలచిపోతాయని ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు అన్నారు. స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని సత్యభాస్కర ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌ను ఆదివారం వారు ప్రారంభించారు. ఎంపీ వంగా గీత మాట్లాడుతూ నామమాత్రపు రుసుముతో అన్ని రకాల వైద్య పరీక్షలు చేసే ఈ ల్యాబ్ సేవలను పేదలు వినియోగించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కురసాల మాట్లాడుతూ నేటి కాలంలో ఇటువంటి ల్యాబ్‌లు సమాజానికి అవసరం అన్నారు. ల్యాబ్ ట్రస్టీ డాక్టర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ పలివెల సత్యరాజు ట్రస్ట్ రూ.2 కోట్ల విలువైన స్థలం ఉచితంగా ఇవ్వగా, దాతల సహకారంతో ల్యాబ్ పరికరాలు, బిల్డింగ్ నిర్మాణం నిమిత్తం మరో రూ.2.5 లక్షలతో ఏర్పాటు చేశామన్నారు. రిటైర్డ్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారి డాక్టర్ ఐవీ రావు, సీపోర్ట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కాకినాడ ఎంపీ గీత, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

ఎన్నో విధాల చేయూతనిచ్చారు

ఉప్పలంక వలంటీర్ మల్లాడి రాజేశ్వరి ఆమె పరిధిలోని కర్రి మణి, భర్త కుమార్ కుటుంబానికి ఎంతో చేదోడుగా నిలచి వారికి అర్హమైన పథకాలను ఇప్పించి ఆదుకుంది. వారు అర్హులయ్యే పథకాలలో లబ్ధి పొందేలా దరఖాస్తులపై సంతకం చేయించి మత్స్యకార భరోసా, వైఎస్సార్ మత్స్యకార పింఛన్, వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, డ్వాక్రాలో సున్నావడ్డీ వంటి పథకాలు వచ్చేలా చేశారు. వలంటీర్‌గా రాజేశ్వరి అందిస్తున్న సేవలను మరువలేమని ఆయా కుటుంబాల వారు చెప్పున్నారు.


ఉప్పలంకలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ రాజేశ్వరి

వైఎస్సార్ చేయూతతో స్వయం ఉపాధి



పేదలమైన మాకు వలంటీర్ ఎంతో సేవ చేశారు. వైఎస్సార్ చేయూత రూ.18,750 మంజూరు చేయించారు. దీంతో కుట్టు మెషీన్ కొనుక్కుని స్వయం ఉపాధి పొందుతున్నాను. రెండేళ్ల క్రితం మత్స్యకార పింఛను మంజూరు చేయించారు. వలంటీర్ చెప్పడం వల్ల అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, డ్వాక్రాలో సున్నావడ్డీ.. ఇలా ఇంతవరకూ రూ.1.86 లక్షల ప్రయోజనం పొందగలిగాం. ఇంతచేస్తున్న జగనన్నను, వలంటీర్ రాజేశ్వరి సేవలను జీవితాంతం గుర్తుంచుకుంటాం.

– కర్రి మణి, ఉప్పలంక

కుటుంబ సభ్యుడిలా సేవలు


లబ్ధిదారు నుంచి వేలిముద్ర సేకరిస్తున్న వలంటీర్ సాయికుమార్

ప్రభుత్వ పథకాలను పేద, అర్హులైన వర్గాలకు అందజేయడంతో వలంటీర్లు ఎంతో సేవచేస్తున్నారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించడంలో వారిచేత ఆయా పథకాలకు వర్తింపజేయడంలో వారిచేతే దరఖాస్తు చేయించి వారికి మంజూరు చేయిస్తున్నారు. భానుగుడి సమీపం నెల్లిమర్ల వీధిలోని వలంటీర్ యు.సాయికుమార్ ఆయన పరిధిలోని ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నారు. కరోనా సమయంలో లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. తనకు కేటాయించిన ఇళ్లలో ఎవరైనా జ్వరాలు, అస్వస్థతలకు గురయ్యారా అని అడుగుతూ వారికి ధైర్యం చెప్పేవాడు. వారికి అవసరమైన వైద్య పరీక్షలు చేయించడమే కాక వారికి ఉచితంగా దాతల సహకారంతో నిత్యావసర వస్తువులు, భోజనం సరఫరా చేశారు.

సాయికుమార్ సేవలు మర్చిపోలేను

కరోనా సమయంలో మా వలంటీర్ సాయికుమార్ అందించిన సేవలు మరువలేను. నేడు ప్రభుత్వ పథకాలు మాకు అందుతున్నాయంటే దానికి కారణంగా వలంటీరే. నాకు నెలానెలా పింఛన్ ఇవ్వడంతోపాటు మా ఇంటిలో జగనన్న విద్యాదీవెన పథకంలో రూ.15 వేలు మా మనుమడికి వస్తుంది.

– బుద్దాల వెంకటలక్ష్మి, లబ్ధిదారు

శాకంబరిగా బాలాత్రిపురాంబిక

సామర్లకోట: సుప్రసిద్ధ పంచారామ క్షేత్రం బాలత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర ఆలయంలో ఆదివారం అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం, అందులోనూ మాసశివరాత్రి, స్వామివారి జన్మ నక్షత్రం ఆరుద్ర కలసిరావడంతో అమ్మవారికి, అయ్యవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయంతో పాటు పంచారామ క్షేత్రం అంతా కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు. ఆలయ ప్రధాన ద్వారం వద్ద అరటి చెట్ల గెలతో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. నంది మండపం వద్ద ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వేదికపై ఉంచి పూజలు చేశారు. ఆలయ ప్రాకారం చుట్టూ కూరగాయలు, ఆకుకూరలతో చేసిన అలంకరణ ఆకట్టుకుంది. ఈఓ నాగేమల్లేశ్వరరావు, ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు, ట్రస్టుబోర్డు సభ్యుల పర్యవేక్షణలో ఆలయ దీపారాధన సంఘ సభ్యులు, ఆలయ అర్చకుల సమక్షంలో దేవదాయశాఖ అధికారులు అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ అభిషేక పండితుడు వేమూరి సోమేశ్వరశర్మ, ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకటసుబ్బారావు, నాతిపాముల సూరిబాబు, కర్రి వెంకటలక్ష్మి, చల్లా కుమారి, బొందలపు కృష్ణవేణి, ముమ్మిడి బేబి రాణి, ఆలయ సిబ్బంది, భక్త సంఘం సభ్యులు భక్తులకు సేవలందించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

శాకంబరిగా నూకాలమ్మ అమ్మవారు

పెద్దాపురం : కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు ఆదివారం వివిధ రకాల కూరగాయలు, పండ్ల అలంకరణలో శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఈఓ తలాటం వెంకట సూర్యనారాయణ, ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యాన అన్ని చర్యలు చేపట్టారు. పెద్దాపురం సీఐ అబ్దుల్ నబీ పర్యవేక్షణలో వెలుగుల సురేష్ బందోబస్తు నిర్వహించారు.


సామర్లకోట పంచారామ క్షేత్రంలో శాకంబరి అలంకరణలో బాలాత్రిపురసుందరిదేవి

నిస్వార్థ సేవకుడు రాగిరెడ్డి

- కుమార్ జయంతి సభలో ఎంపీ, ఎమ్మెల్యేలు

కాకినాడ: దివంగత రాగిరెడ్డి వెంకట జయరామ్ కుమార్ నిస్వార్థ ప్రజా సేవకు చిరునామా అని ఎంపీ వంగా గీతా విశ్వనాథ్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నగర మాజీ అధ్యక్షుడు దివంగత రాగిరెడ్డి కుమార్ జయంతిని స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి, కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. ఎంపీ మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్యే ఉంటూ, ప్రతి కార్యకర్తకు నేనున్నానని భరోసానిస్తూ, పార్టీ పటిష్టత కోసం కుమార్ అవిశ్రాంతంగా పాటుపడ్డారన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేగా తాను గెలుపొందాలని దివంగత కుమార్ ఎంతో పరితపించేవారన్నారు. పార్టీ పట్ల అంకితభావం, క్రమశిక్షణతో పని చేసే కుమార్ వంటి నాయకులు లేకపోవడం పార్టీకి, ప్రజలకు తీరని లోటన్నారు. రాజకీయంగా మంచి స్థానంలో ఉండాల్సిన సమయంలో కుమార్ మరణించడం దురదృష్టకరమన్నారు. జేసీఎస్ కన్వీనర్లు సుంకర విద్యాసాగర్, రాగిరెడ్డి సుబ్బారావు, మాజీ కార్పొరేటర్లు రోకళ్ల సత్యనారాయణ, రాగిరెడ్డి బన్ని, నల్లబిల్లి సుజాత, యువ నాయకులు మల్లిపాముల గణపతి, గద్దేపల్లి దాసు, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్ రాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి నిర్మల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

చిరస్థాయిగా రాగిరెడ్డి పేరు

నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పరితపించిన రాగిరెడ్డి కుమార్ పేరు చిరస్థాయిగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. దుర్గాబాయిదేశ్‌ముఖ్, రాగిరెడ్డి కుమార్ జయంతి సందర్భంగా స్థానిక రాజాజీవీధిలోని ఓం శాంతి ధామ్ భవన్‌లో మైత్రేయి ఉమెన్స్ ఆర్గనైజేషన్, ప్రూటీకుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం వాసవీకల్యాణ మండపం వద్ద రక్తహీనతతో బాధపడుతున్న వారి కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేసి సుమారు 150 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

అలాగే మైత్రేయిదుర్గాబాయి దేశ్‌ముఖ్ అవార్డులను దివంగత లక్కరాజు శేషుకుమారి, రాజయోగిని రజనీ బెహన్‌జీలకు అందజేశారు. మైత్రేయి, సావిత్రిబాయి పూలే అవార్డులను ఠాగూర్ విద్యాసంస్థల రిటైర్డ్ హెచ్ఎం ఇందిరాదేవి, టీచర్ పి.అరుణ్‌కుమార్‌లకు ప్రకటించారు. వీరికి ఎమ్మెల్యే ద్వారంపూడి అవార్డులను అందజేశారు. మైత్రేయి అధ్యక్షురాలు సీహెచ్ సుశీ, ఆదిత్యకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ కుమార్ సేవలకు గుర్తింపుగా నూతనంగా నిర్మిస్తున్న కళాక్షేత్రానికి కుమార్ పేరుపెట్టామని, ఆయన పేరు చిరస్థాయిగా ఉండాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. హైకోర్టు విశ్రాంత జడ్జి ఈశ్వరయ్య, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, జేసీఎస్ కన్వీనర్లు సుంకర విద్యాసాగర్, రాగిరెడ్డి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సాంబమూర్తినగర్ ఆశ్రమ పాఠశాలలో, కొండయ్యపాలెం వృద్ధాశ్రమంలో దుస్తులు పంపిణీ చేసి, భోజన వితరణ చేశారు. విముక్తి కాలనీలో, చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు సేవా కార్యక్రమాలు, రాగిరెడ్డి కుటుంబం ఆధ్వర్యంలో స్థానిక వినాయకుని గుడి వద్ద అన్న సమారాధన చేశారు.


రాగిరెడ్డి కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు


బ్రహ్మకుమారి రజనీ బెహన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

ఉచితంగా రక్త, బీపీ పరీక్షలు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో మధుమేహ వ్యాధిగస్తులకు ఉచితంగా రక్త పరీక్షలు, బీపీ పరీక్షలను ట్రినిటీ ఆస్పత్రి సిబ్బంది ఆదివారం నిర్వహించారు. అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరానికి అధిక సంఖ్యలో వృద్ధులు హాజరవ్వడంతో వారికి ఆస్పత్రి డైరెక్టర్ పేకేటి కిశోర్, సిబ్బంది వీరేంద్ర, వీరబాబు, తదితరులు వైద్య సేవలందించారు.



రోగికి బీపీ పరీక్ష చేస్తున్న వైద్యుడు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సామర్లకోట: మండల పరిధిలో బోయనపూడి గ్రామానికి చెందిన కరణం రమణ కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు సామర్లకోట పోలీసులు ఆదివారం రాత్రి తెలిపారు. కుటుంబ సభ్యులతో పొలం వివాదం కారణంగా రమణ పురుగుల మందు తాగడంతో కుటుంబ సభ్యులు అతడిని కాకినాడ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయినట్లు రమణ కుమారుడు సతీష్ పోలీసులకు తెలిపారు. సతీష్ ఫిర్యాదు మేరకు సీఐ కె.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో ఒకరి మృతి

పిఠాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పిఠాపురం పట్టణ పోలీసులు తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన పెంకే గుర్రయ్య(50) కాకినాడలోని సర్పవరంలో వేరుసెనగ కాయల వ్యాపారం చేస్తుంటాడు. రోజూలానే శనివారం రాత్రి వ్యాపారం ముగించుకుని కారులో చేబ్రోలు వెళుతుండగా పిఠాపురం వైజంక్షన్ వద్ద లారీని ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో అతడిని 108లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పిఠాపురం పట్టణ ఎస్ఐ జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.